ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


మరికల్‌లో పాల ఉట్లను కొడుతున్న యువకులు


మద్దూరులో ఉట్టికొడుతున్న యువకులు


నారాయణపేటలో జ్ఞాపికలు అందిస్తున్న సీఐ

నారాయణపేట: శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలువీధుల్లో యువకులు పాల ఉట్టిలను కేరింతలు కొడుతూ పగలకొట్టారు. స్థానిక శక్తిపీఠంలో స్వామీజీ శాంతనంద్‌పురోహిత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్, హంసవాహినీ తదితర పాఠశాలల్లో విద్యార్థులు వేసుకున్న శ్రీకృష్ణరాధల వేషాధారణలు అందరిని ఆకట్టుకున్నాయి.

■ కృష్ణాష్టమి వేడుకలను చౌక్‌బజార్ మిత్ర మండలి ఆధ్వర్యంలో గురువారం చౌక్‌బజార్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధి వెంకట్రాములు ధ్వజారోహణ, శ్రీకృష్ణ పరమాత్ముడి విగ్రహానికి పూజలుచేసి ప్రసాదవితరణ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ, సీఐ రవిబాబు పాల్గొని జ్ఞాపికలు అందజేశారు.

కోస్గి: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం పలు హైందవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఎంతగానో అలరించాయి. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో కృష్ణుడిని ప్రతిష్ఠించి శ్రీలక్ష్మీవెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాలనుంచి పట్టణ పురవీధుల గుండా బ్రాహ్మణ వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయం వరకు శోభ యాత్ర నిర్వహించారు.

మక్తల్: శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం పట్టణంలో దయానంద్ విద్యామందిర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలువీధుల్లో యువకులు పాల ఉట్లను కొట్టారు. అదేవిధంగా వేణుగోపాల స్వామి ఆలయంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలుచేశారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి ఆలయంలో గోమాతను పూజలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, రవికుమార్‌యాదవ్, రాజేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గసభ్యుడు కొండయ్య, శ్రీరామ్, వర్కటం జగన్నాథ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కోళ్ల వెంకటేష్, శ్రీహరి పాల్గొన్నారు.

నర్వ: మండలంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో పంచామృతాభిషేకం, మహామంగళహారతి, నైవేద్యాలు సమర్పణను అర్చకులు నిర్వహించారు. రాత్రికి అఖండ భజనలు చేపట్టారు.

ఘరికల్: మండలంలోని శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారి విద్యార్థులు గోపికల వేషధారణాలతో ఆటపాటలతో అలరించారు.

ఊట్కూర్: మండలంలోని శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అమీన్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శిశుమందిర్, గీతాంజలి పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్, నాయకులు లక్ష్మారెడ్డి, శంకర్, సీఐ రాంలాల్, ఎస్‌ఐ గోకారి పాల్గొన్నారు.


దామరగిద్దలో..


కోస్గిలో..


నారాయణపేటలో ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు


శక్తిపీఠంలో కృష్ణాష్టమి వేడుకలు..


మక్తల్‌లో గోమాతకు పూజలు చేస్తున్న నాయకులు


ఊట్కూర్‌లో ..

మద్దూర్‌లో..

మద్దూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యార్థులు కృష్ణుడి, గోపికల వేషధారణలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో యువకులు ఉట్టి కొట్టారు. యువజన సంఘం సభ్యులు రఘు, సాయిలు, కాశీ, భరత్, రఘు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండల కేంద్రంతోపాటు కాన్‌కుర్తి, వితలపూర్, మద్దెల్‌బీడ్, లోకూర్తి, ఆశన్‌పల్లి, ఉల్లిగుండం, క్యాతన్‌పల్లి, వత్తుగుండ్ల కాంసాన్‌పల్లి తదితర గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడులను గురువారం ఘనంగా నిర్వహించారు. అలాగే కుందెన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు ఉట్లుకొట్టి సంబరాలు నిర్వహించారు.

ధన్వాడ: శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయా గ్రామాలకు చెందిన చిన్నారులు కృష్ణుడి వేషధారణలో అలరించారు.అదే విధంగా స్థానిక కిష్టాపూర్‌లో శ్రీ కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని పల్లకిలో ఉంచి భజనలు ఆలపించారు.


మక్తల్‌లో..


నారాయణపేటలో..

క్లుప్తంగా

పాఠశాలకు వితరణ



నర్వ: మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలకు బీఆర్ఎస్ నాయకులు దండు అయ్యప్ప వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో బ్లాక్‌బోర్డుల ఏర్పాటుకు గ్రాస్తుల అభ్యర్థన మేరకు రూ.15 వేలను స్థానిక సర్పంచ్ సుజాతకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేష్, రాజారెడ్డి, అశోక్, బి.రాములు, పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి


ఎస్‌ఐ కురుమయ్య

నర్వ: జాతీయ రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్. కురుమయ్య తెలిపారు. ఉచిత లోక్‌అదాలత్‌లో రాజీపడదగు కేసులు, మోటర్ వెహికల్ యాక్సిడెంట్‌కేసులు, విద్యుత్‌చోరి వినియోగదారులు, తగదాలు, ట్రాఫిక్‌కేసులు, ఇరువర్గాల వారు రాజీపడేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ ఇసుకకు అనుమతి ఇవ్వాలి

మరికల్: మండలంలో ఇసుక కొరతతో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయిందని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కుర్మయ్య, గోపి, వెంకటయ్య అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గతయేడాది నుంచి మండలంలో ఆన్‌లైన్ ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోవడంతో నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అక్రమంగా టిప్పర్ల ద్వారా వచ్చే ఇసుక ట్రిప్పుకు రూ. 30వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి రాకొండ, పూసల్‌పహాడ్ వాగుల నుంచి ఆన్‌లైన్ ఇసుకకు అనుమతి ఇవ్వాలని వారు కోరారు.

నేడు పూలే, అంబేద్కర్ విగ్రహావిష్కరణ

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో శుక్రవారం ఉదయం 10గంటలకు మహాత్మజ్యోతిరావు పూలే, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందని గ్రామ నాయకులు అనిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర స్వేరో నాయకులు కావలి కార్తీక్ గుడెబల్లూర్, సూరేపల్లి సుజాత, కోరిమారెప్ప, లక్ష్మీనారాయణ, బుషప్ప హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తు ఫారాల పరిశీలన



మక్తల్: తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది గురువారం బీఎల్‌ఓల నుంచి వచ్చిన దరఖాస్తు ఫారాలను పరిశీలిస్తున్నారు. ఈ నెల 19వరకు ఓటరునమోదు కార్యక్రమం చివరితేదీ ఉండటంతో రెవెన్యూ అధికారులు పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ఫారం6, 8, 7 ఫారాలను పరిశీలిస్తున్నారు.

ముమ్మరంగా సీసీరోడ్డు పనులు

మక్తల్: పట్టణంలోని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో ఏడోవార్డు శ్రీనివాసనగర్, బాలజీనగర్‌లో రూ. 20 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా గురువారం మాజీ మార్కెట్ చైర్మన్ రాజేష్‌గౌడ్ పరిశీలించారు.

శ్రావణమాస పూజలు



ఆత్మకూర్: పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం శ్రావణమాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యుమ్న, వినయ్‌కుమార్, సురేఖ, గోవిందరెడ్డి, వినశ్రీ, నవీన్‌కుమార్, శ్రీదేవి వేంకటేశ్వర్లు, కూరగాయల తిరుపతమ్మ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్: పేదల అభ్యున్నతికి ప్రభుత్వం ఎనలేని కృషిచేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని 110మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముభారక్ చెక్కుల పంపిణీ, కొల్లూర్‌లో పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ భవనానికి రూ. 20 లక్షల నిధులు మంజూరైయ్యాయని తెలిపారు. గ్రామాలకు బీటీరోడ్లు, కల్వర్టులు, సీసీరోడ్లు వేశామన్నారు. ప్రభుత్వం రైతులకు రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మీ, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌గౌడ్, తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఎంపీఓ లక్ష్మీనర్సింహారాజు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ పోరాటసమితి కార్యవర్గం ఎన్నిక


నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మద్దూరు: మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ పోరాట సమితి కార్యవర్గాన్ని పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాలమూరు కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. సమితి మండలాధ్యక్షుడిగా జంగరిరాజు, ఉపాధ్యక్షుడిగా ముద్దిరాజు, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా అభిరామ్‌లతోపాటు మరో పదిమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. మండలంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకోసం పోరాటం చేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు. కార్యక్రమంలో సమితి కొడంగల్ ఇన్‌చార్జి రవికుమార్, నాయకులు శ్రీహరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలి

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు అంజిలయ్యగౌడ్, సర్పంచ్ లాలప్ప అన్నారు. గురువారం మండలంలోని ముస్తాపేటలో ఉపాధిహామీ కూలీలతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక ధరలను నియంత్రించాలని, ఉపాధికూలీల రోజు కూలీని ఆరువందలు పెంచాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తు పేదలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించి ఉపాధి అవకాశాలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాజు, గోవింద్, అశోక్ ఉపాధికూలీలు పాల్గొన్నారు.


ముస్తాపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు

పారిశుద్ధ్యంపై అవగాహన


వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఊట్కూరు: మండలంలోని ఏర్గాట్‌పల్లిలో పులిమామిడి ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటుచేసి పారిశుద్ధ్యంపై అవగాహన నిర్వహించారు. గతవారం రోజులక్రితం గ్రామంలో ఓ బాలుడికి డెంగీసోకడంతో రెండురోజులుగా ఇంటింటి తిరిగి ఫీవర్ సర్వే, రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డా. సాయిరాం మాట్లాడుతూ.. దోమలతో విషజ్వరాలు సోకే ప్రమాదం ఉందని, ఇంటి పరిసరాలలో మురుగుగుంతలను పూడ్చివేయాలని, రోడ్లవెంబడి ఉన్న ముండ్లపొదలను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున్, వైద్య సిబ్బంది సురేష్‌కుమార్, అంబుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ బస్సును పునరుద్ధరించాలి


ఆర్టీసీ డిపోమేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఊట్కూర్: ఊట్కూర్ గ్రామం మీదుగా హైదరాబాద్ బస్సును పునరుద్ధరించాలని ఎంపీజే జిల్లా అధ్యక్షుడు ఖాజీం హుసేన్ అన్నారు. గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీసుధాకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నోఏళ్ల నుంచి గ్రామం మీదుగా వెళ్తున్న హైదరాబాద్ బస్సును ఆరునెలలుగా నిలిపివేశారని తెలిపారు. అధికారులు స్పందించి హైదరాబాద్ బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముజాహిద్, సిద్ధిక్, అల్తాఫ్ హుసేన్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన


చిరుధాన్యాలతో కిరీటాలను తయారు చేసి చూయిస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఊట్కూరు: మండలంలోని ఏర్గాట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిరుధాన్యాలపై గర్భిణీ, బాలింతలకు అవగాహన నిర్వహించారు.ఈ సందర్భంగా చిరుధాన్యాలలో ఉండే పోషక విలువలపై వివరించారు. అనంతరం చిరుధాన్యాలతో కిరీటాలను తయారుచేసి విద్యార్థులను అలంకరించి చూయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సావిత్రిబాయి, సర్పంచ్ మల్లికార్జున్, గ్రామస్తులు లక్ష్మీ, వెంకటమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉదయనిధి దిష్టిబొమ్మ దహనం


మక్తల్‌లో ర్యాలీనిర్వహిస్తున్న నాయకులు

మక్తల్: సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి చేసిన అనుచిత వ్యాఖ్యలను వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు ఖండించారు. హిందు ధర్మాన్ని కించపరిచేవిధంగా మాట్లాడటం సరికాదన్నారు. మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధార్మిక సంఘం సభ్యుడు బీంరెడ్డి, సత్యనారాయణగౌడ్, రమేష్, శ్రీనివాసులు, కర్నిస్వామి పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన శిబిరంలో నేత్ర వైద్యులు భాస్కర్‌గౌడ్ పలువురికి కంటిపరీక్షలు చేశారు. వీరిలో 30మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటిశుక్లాలు ఉన్నవారికి పాలమూరు లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెజ్జు వెంకట్రాములు, కో–శాధికారి కొటాల్ శంకర్, ప్రతినిధులు శేఖర్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న బాల్‌రాం

కోస్గి: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల సాధనకోసం ఈ నెల 13న నిర్వహించనున్న చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో కార్మికులతో సన్నాహక సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు..పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పెరిగిన వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలివ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు మణిమాల, ఆశమ్మ, పద్మమ్మ, షభాన బేగంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజుకు చేరిన రిలేదీక్షలు

నారాయణపేట: సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ పార్కు వద్ద చేపట్టిన రిలేదీక్షలు గురువారంతో మూడోరోజుకు చేరుకున్నాయి. కేజీబీవీలో పనిచేసే సిబ్బంది, ఎంఐఎస్ కో –ఆర్డినేటర్లు, సీఆర్‌పీలు, పీటీఐలు, మెసెంటర్లకు విద్యాశాఖలో విలీనంచేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్‌చేస్తూ వంటావార్పు చేశారు. దీక్షలు చేపడుతున్న వారికి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మద్దతు తెలిపి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషిచేస్తామని తెలిపారు. అదేవిధంగా తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు.. సమగ్రశిక్ష ఉద్యోగుల హామీలు సుప్రీంకోర్టు తీర్పుప్రకారం మినిమం టైం స్కెల్ అమలు చేయాలని, మహిళ ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని, విద్యాశాఖలో చేపట్టే ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణరెడ్డి, నాయకులు రాజశేఖర్, రాఘవేంద్రనాయుడు, ఎల్లాగౌడ్, అల్తాఫ్ హుస్సెన్, అరుణ, భాగ్య, లక్ష్మి, మనోహర్, నవీన్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


పేటలో వంటావార్పు చేస్తున్న ఉద్యోగులు

‘కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం’



మక్తల్‌లో జోడో యాత్రను ప్రారంభిస్తున్న రాష్ట్ర పీసీసీ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని రాష్ట్ర పీసీసీ కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రారంభించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మక్తల్ పట్టణంలో భారత్ జోడో యాత్రను ఆయన ప్రారంభించారు. మొదటగా పడమటి ఆంజనేయస్వామి దేవాలయం, నల్ల జానమ్మలకు ప్రత్యేక పూజలు చేసి యాత్ర ప్రారంభించారు. మక్తల్‌లోని పురవీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తున్నాయని అన్నారు. ప్రాజెక్టులు సాధించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సెల్ కోర్ కమిటీ సభ్యుడు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.